- డా. పి.శివరామకృష్ణ

పూను స్పర్ధలు విద్యలందే - వైరములు వాణిజ్యమందే

తొండముదిరి ఊసరవెల్లిగా మారినట్లు ప్రజాసంస్థలు - రాజకీయాల్లోకి, రాజకీయనాయకులు - ప్రభుత్వంలోకి వచ్చే క్రమంలో రంగులుకూడా మారుతుంటాయి. ఎన్ని ఓట్లు సంపాదించాము అనేది కాదు. అన్యాయాన్ని ఎదిరించగల ఎంతమందిని తయారుచేసాం! ఇదే నాయకత్వానికి గీటురాయి.

పోటీసృష్టి ధర్మం- మోసం వ్యాపారధర్మం. మనం తరతరాలుగా వాడే పసుపుఉత్పత్తులను తమ పరిశోధనద్వారా కనిపెట్టినట్లు చెప్పుకొని వాటిమీద పేటెంట్ సంపాదించుకొవడానికి విదేశీసంస్థలు చేసిన ప్రయత్నాలు ఎలాగో తిప్పికొట్టాం. వేపఉత్పత్తులు - బాస్మతిరకం వరివంగడాలమీద తగవుఇంకా తేలాలి. ఈ హక్కులు నిరూపించుకోవడానికి తరతరాలుగా మనం అశ్రద్ధచేస్తూవచ్చిన ఆయుర్వేదగ్రంధాలే దిక్కైనాయి. ఎటువంటి గ్రంధాల ఆధారాలులేని కొండకోనలలో గిరిజనులకు ఈ హక్కులు దక్కడానికి కేరళలో TBRI కి చెందిన (Tropical Botanical Research Institute) శాస్త్రవేత్త శ్రీ పుష్పాంగదన్ నిజాయితీ కారణం.

అరుదైన నిజాయితీ :

పరిశోధనవశాన శ్రీపుష్పాంగదన్ బృందం, కేరళ అడవులలో తిరుగుతున్నప్పుడు. 'కాని' తెగ గిరిజనులు ఆ బృందానికి కూలీలుగా పనిచేశారు. కొండలు తిరుగుతూ, ఆ బృందం అలసిపోయేది. కాని వారితో తిరిగే గిరిజనులు అలసిపోయేవారుకాదు. మధ్యమధ్య నములుతున్న ఒక చెట్టుఆకులు వారి అలసట పొగొట్టేవి. ఈ ఆకుల ధాతులక్షణాలను పరిశోధించి తయారుచేసిన 'టానిక్'కు పేటెంట్ పొందిన పుష్పాంగదన్, దానివల్ల వచ్చేలాభాల్లో 'కాని' తెగవారికి కొంతవాటా చేందేటట్లు ఒప్పందంచేశారు. కాని శాస్త్రవేత్తలందరూ ఇంత నిజాయితీపరులుకారు. అమాయకులైన గిరిజనులు చెప్పిన మందులు తామే కనిపెట్టినట్లు చెప్పుకునే ప్రబుద్ధులే ఎక్కువమంది. అటువంటి అమాయకులను, వారినుంచి విషయాన్ని సంగ్రహించే శాస్త్రవేత్తలను ప్రలోభపెట్టి, మందులతయారీసంస్థలు ఆ సూత్రాలను తమసొంతం చేసుకుంటున్నాయి. కాబట్టి వాటాఇవ్వడం ఒకటే పరిష్కారంకాదు. వారి జ్ఞానాన్ని సూత్రీకరించగల శాస్త్రాన్ని అభివృద్ధిచేయాలి. ఆదిశలో మనదేశంలో ఇంకా ప్రయత్నాలు మొదలేకాలేదు.

పోటీపడుతున్న ప్రభుత్వాలు :

తరతరాలుగా వచ్చిన విజ్ఞానంమీద హక్కుకూడా ప్రభుత్వానిదే. ప్రభుత్వమే ప్రజల సంక్షేమం చూస్తుందికాబట్టి ప్రజలజ్ఞానం సొమ్ముచేసుకునే హక్కులు తమకే ఉండాలని మనదేశంతోసహా చాలా మూడవప్రపంచ దేశాలు ప్రపంచవాణిజ్యసంస్థ చర్చలలో పట్టుబడుతున్నాయి. మెర్క్(MERC)అనే మందుల తయారి కంపెనీ కోస్టారికాదేశంలోని జీవవైవిధ్యంపై ఆదిమజాతుల జ్ఞానాన్ని సేకరించడానికి భారీగా పెట్టుబడి పెట్టింది. మన ప్రభుత్వాలు ఇదేదారి పట్టినా అశ్చర్యంలేదు.

దోపిడీ మనవారసత్వం :

దోపిడీ అమెరికావాడికి మాత్రమే సొంతంకాదు. దీంట్లో మనం ఎప్పుడో పండిపోయాం. నేటి పూరీక్షేత్రంగల ప్రాంతం ఒకనాడు పెద్దఅడవి. ఆ ప్రాంతంరాజు ఆ అడవిలో వేటకువెళ్ళాడు. పగలంతా వేటాడి అలసిపోవడమేతప్ప సైనికులకు పెద్దగా వేటదొరికేదికాదు. వారికి సాయపడే స్థానిక గిరిజనులు 'సవరలు' మాత్రం తాము వేటాడి తెచ్చిన మాంసంలో అతిధులైన రాజపరివారానికి వాటా ఇచ్చేవారు. పగలంతా వేటాడి, రాత్రంతా ఆటపాటలతో గడిపి, మళ్ళీపొద్దున్నే వేటకుతయారయ్యేవారు. ఏ మాత్రం అలసట లేకపోవడమేకాదు. తప్పకుండా వేటసంపాదించే వారి శక్తియుక్తుల మర్మమేమిటో తెలుసుకోవలసిందిగా తన పురోహితుడు 'విద్యాపతిని' కోరాడు. అతడు ఈ మర్మం కనిపెట

ట్లలేకపోయాడు. ఈ మధ్యలో ఒక సవరయువతి అతని ప్రేమలోపడింది. ఆమె ద్వారా వాళ్ళదేవుడు జగన్నాధుడిని కనిపెట్టి తనవశం చేసుకున్నాడు. ఆ రాజవంశీయుల వారసుడు జగన్నాధ రధయాత్రనాడు బంగారుచీపురుతో ఊడుస్తుంటే కళ్ళప్పగించి టెలివిజన్‌లో చూస్తాంకాని, ఆ దేవుడిని అందించిన సవరజాతి మాత్రం మనకు గుర్తురాదు.

స్ఫూర్తిలేని సంప్రదాయం :

కాని సవరలు ఈ మోసాన్ని జీర్ణించుకొలేకపోయారు. జగన్నాధుడిని నిలదీసారు. చదువుసంధ్యలతో నాగరికులు తనను వశం చేసుకున్నారని - తాను 'అక్షరబ్రహ్మ'గా అవతరిస్తానని - తనను చదువుతో అర్చించవలసినదిగా ఓదార్చాడు. మతాంతరులుకాగా మిగిలిన శుద్ధసవరలు నాటినుండి 'అక్షరబ్రహ్మ'ను ఆరాధించసాగారు. అయితే ఈ హక్కులసాధనలో భాగంకావలసిన ఈ సంప్రదాయం, మతంలో భాగంగా మారింది. కాలక్రమాన కోల్పోయిన తమ భూములు, అడవులు, వనరులు దక్కించుకోవడానికి కావలసిన రివిన్యూఫారెస్టు చదువులు నేర్చుకోవలసిందిపోయి, ఒక లిపి కనిపెట్టి అది తమ ప్రత్యేకతకు చిహ్నంగా భావిస్తూ, పొద్దున, సాయంత్రం పూజాపునస్కారాలు చేస్తూ ఒక భజన సంఘంగా మారింది. శ్రీకాకుళం విజయనగరం జిల్లాలో గిరిజనులతో పనిచేసే 'ఆర్ట్స్‌సంస్థ' నిర్వహించిన గిరిజనమేళాలో సవరల సంప్రదాయంలో తాత్పర్యాన్ని వారికి గుర్తు చేయడంతోపాటు భూమిసర్వేలో వారికి శిక్షణకూడా ఇచ్చే అవకాశం కలిగింది. ఏమేరకు జ్ఞానాన్ని వనరులను కాపాడుకొనేది, సొంతంచేసుకునేది, సవరల, వారిసంస్థల పట్టుదలబట్టి ఉంటుంది.

ఐతే ఈశ్రమఅంతా ప్రజలెక్కడ పడతారు! ఎప్పటికివాళ్ళు సంఘటితం అవుతారు. మేం మేధావులం, నీతిమంతులం. ప్రభుత్వం నడిపించడం మాకు కొట్టినపిండి, అదేదో మేం చూసుకుంటాం. మీరు మాకు ఓటువేస్తేచాలు అంటూ భ్రమపెట్టే ప్రచారాలమధ్య జనంలక్ష్యం చెదిరిపోతున్నది. వారి సాధన మందగిస్తున్నది.

ఓట్ల రాజకీయం :

2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఆందోళన సందర్భంగా ఒక ప్రజాసంస్థ మూడుగ్రామాలలో విద్యుత్ వినియోగం లెక్కలు వినియోగదారులకు నేర్పింది. వినియోగదారుల భాగస్వామ్యంతో విద్యుత్‌చౌర్యం, ప్రభుత్వసిబ్బందిలో జవాబుదారీతనం పెరిగినట్లు చెప్పుకుంది. మరిన్ని గ్రామాలలో ఇటువంటి ప్రయత్నంద్వారా జనాన్ని సమీకరించడానికి బదులు 'రాజకీయాలు మారాలి - దానికి మీ ఓట్లు కావాలి' అంటూ 1950 నుండి వింటున్న పాతపాఠమే వల్లించసాగింది. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికి వాటంతట అవే ప్రజలపనులు జరిగిపోవు.

రాజకీయవ్యాపారం :

రాజకీయం ఒక వ్యాపారం. అభ్యుదయం ముసుగువేసుకొని ఈ వ్యాపారంబాగా చేసుకోవచ్చు. పశ్చిమగోదావరిజిల్లాలో గిరిజనప్రాంతంలో చెలరేగిన భూవివాదాలు పరిష్కరించడానికి, జిల్లాకలెక్టరు, తన అధ్యక్షతన అన్నివర్గాలసభ్యులతో జిల్లాకమిటీ, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేశారు. ఈ గ్రామస్థాయికమిటీలకు ముందుగా రికార్డులిచ్చి హక్కులతనిఖీ చేపట్టవలసిందిగా ప్రభుత్వం, కోర్టు ఆదేశించాయి. కాని అధికారులు ఒక రాజకీయపక్షం కార్యకర్తలకు ఈ రికార్డులిచ్చారు. నాటి జాయింట్‌కలెక్టరు పార్టీకార్యకర్తలు - గిరిజనేతరులు తనిఖీ ఫలితాలపై సంయుక్త ప్రకటన చేశారు.

'బుట్టాయిగూడెంమండలం రెడ్డిగణపవరం గ్రామంనందు అనుభవసర్వే మరియు రికార్డులపరిశీలన తర్వాత నిర్ధారించిన భూములవివరాలు.....తేది..... (సం.) రామకృష్ణమూర్తి, ఎంఆర్.ఓ., బుట్టాయిగూడెం మండలం, (సం.) ఎం. సుబ్రహ్మణ్యం జాయింట్ కలెక్టర్, ప.గో.జిల్లా, (సం.) ఎం. ఈశ్వరయ్య సి.పి.ఐ.(యం) పార్టీ తరపున, (సం.) ఎన్.వి.బి.యల్. ఆచార్యులు, అడ్వకేట్, (సం.) అల్లూరి రామారావు, (సం.) పి. భాస్కరరావు, (సం.) తూంపాటి వెంకటరావు, గిరిజనేతర రైతులతరపున'.

గ్రామ, జిల్లాకమిటీలద్వారా ఈ తనిఖీ జరిపించనందుకు జస్టిస్‌స్వామి మొత్తం విధానాన్ని ఫలితాలను దుయ్యబట్టారు (రిట్‌పిటిషన్ నెం.7916/97లో ఉత్తర్వులు తేది. 24-1-2000). రాజకీయపక్షం, అధికారవర్గం

తేలుకుట్టినదొంగలాగా మౌనంవహించారు.

పారని పాచిక :

అన్నిచోట్ల జనాన్నిమభ్యపెట్టి కథ నడిపించే పాచికపారలేదు. నాయకులు మధ్యలో దూరి తమను వంచిస్తారని పసిగట్టారు. తనిఖీతరువాత తయారుచేసిన రికార్డు తమకు ఇవ్వలేదంటూ దర్భగూడెం గిరిజనులతరపున ది.29-11-99న జిల్లాకమిటీ సమావేశంలో ఫిర్యాదుచేసారు.

''దర్భగూడెం గ్రామములో ఎంజాయ్‌మెంటు సర్వే మరియు టైటిల్ వెరిఫికేషన్ పూర్తిచేసిన తరువాత కన్‌సాలిడేటెడ్ వివరములు, కొన్ని పట్టాభూములకు సంబంధించిన వివరములు అందజేయలేదనియు మరియు గవర్నమెంటు పోరంబోకు భూముల వివరములు, సంబంధిత రికార్డులలో మార్పులు చేయకుండా గిరిజనేతరులకు పట్టాలు మంజూరు చేసినారనియు, తెల్పియున్నారు. సదరు భూములలో గిరిజనేతరులకు యిచ్చిన పట్టాలు చెల్లవనియు తెలియచేసినారు. దర్భగూడెం గ్రామములో ఎంజాయ్‌మెంటుసర్వే ఫైనలులిస్టు ప్రకటించలేదనియు, తదుపరి జీలుగుమిల్లి గ్రామములో ఎంజాయ్‌మెంట్ సర్వే మొదలుపెట్టినారనియు వివరించినారు. చర్య: మండలరెవిన్యూ అధికారి జీలుగుమిల్లి/అసిస్టెంటు డైరెక్టరు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు, ఏలూరు''.

ఈ తీర్మానం రికార్డుచేసి కలెక్టరు చేతులుదులుపుకున్నారు. పదినెలలకైనా సమాధానం ఇవ్వకపోయేసరికి గ్రామకమిటీలో గిరిజనులు కోర్టుక్కెకారు, ''ఈ పిటీషనర్ ఏమీ రహస్యసమాచారం అడగడంలేదు. పిటీషనర్ కోరిన దస్తావేజులన్నీ పబ్లిక్ రికార్డులు, (ప్రజలరికార్డులు) అసలు జిల్లాకమిటీని గిరిజనేతరుల అధీనంలోగల భూముల వివరాలు నిర్ధారించడానికే ఏర్పరచారు. ఈ రికార్డులు ఇచ్చినందువలన జరిగే నష్టమేమిలేదు. ఈ పరిస్థితులలో తనిఖీలో సేకరించిన అన్ని వివరములను ఈ ఉత్తరువు అందిన రెండువారాలలోగా అందించవలసినదిగా అధికారులను ఆదేశించడమైనది. ఇంకా కావలసిన సమాచారం కోసం పిటీషనర్ మళ్ళీ ధరఖాస్తు చేయవచ్చును'' అని న్యాయమూర్తి సుదర్శనరెడ్డి ఉత్తర్వులు జారీచేసారు (రిపిటీషన్ నెం.19896/2000, ఉత్తర్వు తేది.23-8-2000). నిరంతరం జాగ్రత్తవహిస్తూ అడుగడుగునా నిలదీయడమే ప్రయోజనాలను కాపాడుతుంది. లేకపోతే 'ఉన్నది ఒకటే ఓటు - బతుకుతెరువుకే లోటు' అంటూ మొత్తుకోక తప్పదు.

తొండముదిరి ఊసరవెల్లిగా మారినట్లు ప్రజాసంస్థలు - రాజకీయాల్లోకి, రాజకీయనాయకులు అధికార ప్రభుత్వంలోకి వచ్చే క్రమంలో రంగులుకూడా మారుతుంటాయి. ఎన్ని ఓట్లు సంపాదించాము అనేది కాదు. అన్యాయాన్ని ఎదిరించగల ఎంతమందిని తయారుచేసాం! ఇదే నాయకత్వానికి గీటురాయి.

''ప్రజలే ప్రభువులు అనుకునేవాడు ప్రజలను నడిపిస్తాడు
ప్రభువును కావాలనుకునేవాడు ఓట్లవేటలోపడతాడు''